సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 20 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.8.20 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరం లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జై భారత్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



సీసీ రోడ్డు నిర్మాణంపై చర్చిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్ నగర్‌లో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. సీసీ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, కాలనీ వాసులు కుమారస్వామి, మహేష్, సురేష్, కృష్ణంరాజు, శివరాం ప్రసాద్, వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్, సాంబశివరావు, నరేష్, రాఘవేంద్ర రావు, రాజు, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి



కార్పొరేటర్ నర్సింహాయాదవ్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని సిండికేట్ బ్యాంక్ కాలనీలో సమస్యలను పరిష్కరించడంతో స్థానికులు ఆదివారం కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ వాసుల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీహాల్‌ను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మైపాల్‌రెడ్డి, కృష్ణయ్య, మాధవరెడ్డి, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్‌లో రూ.50 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట్ నాయక్, పోశెట్టి గౌడ్, రాజుగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

యాజమాన్యంతో చర్చించి.. వేతనం ఇప్పించి



మహిళా కార్మికులకు వేతనం ఇప్పించిన రవిసింగ్

మూసాపేట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాంధీ నగర్ ఇండస్ట్రీ ప్రాంతంలోని శ్రీ జీవన్ పాలిమర్ కంపెనీలో 24 మంది మహిళా కార్మికులు కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. మేనేజ్‌మెంట్ మారటంతో వారికి రావాల్సిన రెండు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి వారిని బయటకు పంపించారు. దీంతో వారు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకులు రవిసింగ్‌ను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన కంపెనీకి వెళ్లి యాజమాన్యంతో మాట్లాడి మహిళా కార్మికులకు రావాల్సిన మే నెల వేతనాన్ని ఆదివారం ఇప్పించారు. త్వరలో జూన్ నెల వేతనం కూడా ఇప్పిస్తానన్నాడు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

ఫస్ట్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పటేల్ కుంట పార్కు దగ్గర ఫస్ట్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, బీఎంఐ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఫస్ట్ కేర్ ఫార్మసీ మేనేజర్ శేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలని, పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీలు సురేష్, షహబాజ్, ఫస్ట్‌కేర్ ఫార్మసీ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

నిందితులను శిక్షించాల్సిందే..



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అవంతీనగర్ ఈస్ట్ కాలనీ వాసులు

మూసాపేట: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. మూసాపేట డాక్టర్స్ అసోసియేషన్, పంచశీల పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మూసాపేట నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో..

మోతీనగర్: నీలిమ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం పాండురంగానగర్ నుంచి మోతీనగర్ చౌరస్తా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను రక్షించే వైద్యులపై దాడులు చేస్తే వైద్యం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ర్యాలీలో వైద్యులు అనూపమ, నాగరాజు, శ్రీ తేజ, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అవంతీనగర్ ఈస్ట్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు వీరబాబు ఆధ్వర్యంలో యువ వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుమార్ యాదవ్, పి. నర్సింహారెడ్డి, తన్నీరు తిరుపతిరావు, తక్కెల్లపల్లి దేవేందర్‌రావు, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నీలిమ ఆసుపత్రి వైద్యులు



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ కళాశాలల నిర్మాణమెప్పుడో?

ఆస్‌బెస్టాస్ కాలనీలోని హుడా లే అవుట్‌లో ఖాళీగా ఉన్న స్థలం



ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

- మందుబాబులు, పోకిరీలకు అడ్డాగా మారిన వైనం
- ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోసం ఎదురు చూపులు



బడి, కళాశాల నిర్మాణం కోసం గతంలో వదిలిన ఖాళీ స్థలం

ఆల్విన్‌కాలనీ: పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవటంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల మధ్యలో ఉన్న జగద్గిరిగుట్ట ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా లే అవుట్ అనుమతులతో ఏర్పడింది. సుమారు 40 సంవత్సరాల క్రితం సనత్‌నగర్‌లోని బిర్లా కంపెనీ కార్మికుల కోసం కూకట్‌పల్లి జగద్గిరిగుట్టలో ఆస్‌బెస్టాస్ కాలనీ పేరుతో హుడా లే అవుట్ అనుమతులతో కాలనీలో ఇళ్లను నిర్మించి కార్మికులకు అందజేశారు. హుడా అనుమతుల ప్రకారం కాలనీలో గుడి, బడి, పార్కుల కోసం స్థలాలను వదిలారు. పార్కులు, గుళ్లను అభివృద్ధి చేశారు. కానీ కళాశాల కోసం వదిలిన ఖాళీ ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలు లేకపోవడంతో పోకిరీలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. ఆస్‌బెస్టాస్ కాలనీ ఆనుకుని ఉన్న సుమారు 50 నుంచి 100 లోపు చిన్న చిన్న కాలనీ, బస్తీలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఈ చుట్టు పక్కల బస్తీల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టణాలలోని లే అవుట్‌లలోని ప్రభుత్వ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు నిర్మించాలని, ఆ స్థలాలను గుర్తించి సర్వే చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇక్కడి అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్‌బెస్టాస్ కాలనీలో హుడా అనుమతుల ప్రకారం ప్రభుత్వ కళాశాల, బడుల కోసం సుమారు అర ఎకరం పైనున్న ఖాళీ ప్రదేశంలో కళాశాలలను నిర్మించాలని కోరుతున్నారు.

కాలనీ ఏర్పాటప్పుడే స్థలాన్ని కేటాయించారు



తమ కాలనీ ఏర్పాటు చేసినప్పుడే ముందు చూపుతో బడుల కోసం స్థలాన్ని వదిలారు. కానీ ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తున్నది. దీంతో 10వ తరగతి వరకు చదివించి ఆపివేస్తున్నారు. ఈ ప్రాంతంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులు చదువులను కొనసాగిస్తారు.

– నరేష్, ఆస్‌బెస్టాస్ కాలనీ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేటలోని వార్డు కార్యాలయంలో ఆదివారం జనహిత సేవ కిమ్స్ ఫౌండేషన్, యూత్ ఫర్ సేవ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వేంకటేశ్వరనగర్‌కు చెందిన వెంకటయ్యకు రూ. లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీరాముల వెంకటకుమార్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు మరిన్ని సదుపాయాలు

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో హాకీ క్రీడ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆయన ఛాంబర్‌లో తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండా విజయ్, కార్యదర్శి భీంసింగ్,ఆయనను కలిశారు. అక్టోబర్‌లో తెలంగాణ నిర్వహించే తెలంగాణ హాకీ టోర్నమెంట్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

రాఖీ పండుగ.. మార్కెట్లు నిండుగా!



షాపూర్‌నగర్ మార్కెట్, సుచిత్ర, జగద్గిరిగుట్ట, చింతల్ ప్రధాన రోడ్ల వెంబడి రాఖీల దుకాణాలు వందల కొలది వెలిశాయి.

రంగారెడ్డినగర్: అన్నా చెల్లెళ్ల ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ (రాఖీ) పండుగ నేపథ్యంలో ఆదివారం ప్రధాన మార్కెట్లు మహిళలతో కిటకిటలాడాయి. తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు ఆయా దుకాణాల వద్ద మహిళలు బారులు తీరారు. చిన్నారులను సైతం ఆకట్టుకునేందుకు మార్కెట్లలో వైరటీ రాఖీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. గిటార్, విజిల్, కెమెరా, విమానం, కారు, రాకెట్ ఆకృతుల్లో రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. వీటి ధర ఒక్కొక్కటి రూ.50 మొదలుకుని రూ.100 వరకు పలికింది. అదే విధంగా పెద్దలకు కట్టేందుకు దూది రాఖీలు, వివిధ స్టోన్లతో రూ.20 మొదలుకుని రూ.250 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి.

'మనూ'లో ఇద్దరికి పీహెచ్‌డీ



తలత్ పర్వీన్



పీర్జాదా షుయబ్ అమీన్ పర్సా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇద్దరు పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ డిగ్రీలను ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ సైన్సెస్‌లోని ఫిజిక్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని తలత్‌పర్వీన్‌కు,అలాగే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పరిశోధక విద్యార్థి పీర్జాదాషుయబ్ అమీన్ పర్సాకు పీహెచ్‌డీని ప్రకటించారు. తలత్‌పర్వీన్ 'భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో అస్థిరత సూచికల పరిశీలన, పోలికలు రేడియోసోండే డేటా ద్వారా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించగా పీర్జాదాషుయబ్ అమీన్ పర్సా 'విపత్తు నిర్వహణలో పరిపాలన పాత్ర: కాశ్మీర్‌లో 2014 వరదల అధ్యయనం' అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

కేంద్రంలో కార్యదర్శిగా హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థికి ఉన్నత పదవి లభించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి నాగరాజుమద్దిరా కేంద్ర ఆర్థిక శాఖలోని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన 1988–90 విద్యా సంవత్సరంలో హెచ్‌సీయూలోని తత్వశాస్త్రంలో ఎంఏ పూర్తి చేశారు. ఆ సమయంలోనే హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడుగా కూడా పనిచేయ డం విశేషం. హెచ్‌సీయూలో పూర్వ విద్యార్థుల స్పీకర్ సిరీస్‌లో భాగంగా 1990లో ఆర్థిక సంస్కరణలపై నాగరాజు ప్రత్యేక ఉపన్యాసం చేశారు.

అవంతీనగర్ ఈస్ట్ కాలనీ అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి విజయం



అధ్యక్షుడిగా విజయం సాధించిన నర్సింహారెడ్డి తదితరులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతీనగర్ ఈస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నిక కోసం స్థానిక దంజిభాయ్ చిప్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. లయన్ అన్నెం కోటిరెడ్డిపై నర్సింహారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారని ఎన్నికల అధికారి రమేష్ చౌహాన్, సత్యనాథన్ తెలిపారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన పి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో అవంతీనగర్ ఈస్ట్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో అంకం వీరబాబు, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, బండారి సుశీల్ కుమార్ యాదవ్, తన్నీరు తిరుపతిరావు, రమణ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



రాయదుర్గం: ఉచిత నేత్రవైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఆదివారం టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ, స్థానికుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలోని వైద్య బృందం 145 మంది స్థానికులకు కంటి పరీక్షలను నిర్వహించారు. వైద్యులు నిఖిల్ కాంబ్లే, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌కు పెయింటింగ్ పనులు షురూ



రాయదుర్గం: రోడ్డు డివైడర్‌కు పెయింటింగ్ చేసే పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం పాత ముంబయ్ జాతీయ రహదారి నుంచి జీపీఆర్‌ఏ క్వార్టర్స్, శాంతిసరోవర్, పుల్లెల గోపీచంద్ అకాడమీ వరకున్న రోడ్డులో డివైడర్‌కు పెయింటింగ్ చేసే పనులను నిర్వహించడం ప్రారంభించారు. ఈ పనులను శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ జీకేడీప్రసాద్ పరిశీలించారు.

పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మహేందర్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. 374వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్‌లలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన జీవిత చరిత్రను వివరించారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు





శివానంద రిహాబిలేషన్ సెంటర్‌లో లెప్రసీ రోగులకు శాలువాలను పంపిణీ చేస్తున్న బాబూరావు



పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు